Eenadu D1-25/06/23

# హైదరాబాద్ మెట్రో రెండో దశకు అనుమతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు రంజిత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎంపీ ఎన్వీఎస్ రెడ్డిలతో కలసి కేటీఆర్ శనివారం కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్‌ను కలిశారు. పట్టణాల్లో అసంఘటిత కార్మికులు పెరుగుతున్నందున.. దేశవ్యాప్తంగా పట్టణ పేదల ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలని కోరారు.

## కేంద్ర మంత్రికి కేటీఆర్ చేసిన విజ్ఞప్తులు

◆ హైదరాబాద్‌లో అనుసంధాన రహదారుల కోసం హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 22 మిస్సింగ్ రోడ్లను గుర్తించి పూర్తి చేశాం. మరో 17 రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఓఆర్ఆర్ నుంచి నగర సమీపంలోని పట్టణాల్లోనూ 104 అదనపు కారిడార్ల నిర్మాణానికి రూ.2400 కోట్ల వ్యయమవుతుంది. అందులో మూడో వంతు రూ.800 కోట్లు కేంద్రం ఇవ్వాలి.

◆ హైదరాబాద్‌లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.400 కోట్లు ఇవ్వాలి.

◆ కోకాపేట ప్రాంతం సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌గా అభివృద్ధి చెందుతోంది. కేపీహెచ్‌బీ-కోకాపేట-నార్సింగి కారిడార్‌కు ఎంఆర్‌టీఎస్ ఏర్పాటు, మెట్రోతో అనుసంధానం, 30 కి.మీ. ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి ఆమోదం కావాలి. రూ.3050 కోట్లతో చేపట్టే ఎంఆర్‌టీఎస్ ప్రాజెక్టులో 15 శాతం కేంద్రం వాటా కింద రూ.450 కోట్లు కేటాయించాలి.



కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీలు రంజిత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్

◆ హైదరాబాద్‌లో మూసీతో పాటు రాజేంద్రనగర్-ఎల్బీనగర్, కూకట్‌పల్లి-కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో రూ.3,722.82 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రా(ఎస్టీపీ)లు నిర్మిస్తున్నాం. దీనికి 20 శాతం వాటా కింద కేంద్రం రూ.744.56 కోట్లు ఇవ్వాలి.

◆ శానిటేషన్ హబ్‌తో పాటు మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల వంటి పలు కార్యక్రమాలను వివిధ నగర, పురపాలికల్లో చేపడుతున్నాం.

ఈ స్వచ్ఛత కార్యక్రమాలకు రూ.3777.12 కోట్ల వ్యయమవుతోంది. అందులో 20 శాతం వాటాగా రూ.750 కోట్లు మంజూరు చేయాలి.

## అదనంగా 20 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం తీసుకోండి

తర్వాత కేటీఆర్ కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. తెలంగాణ నుంచి 2022-23 యాసంగి పంటకు సంబంధించి అదనంగా 20 లక్షల టన్నుల ఉప్పుడు (పారాబాయిల్డ్) బియ్యం తీసుకోవాలని గోయల్‌కు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. యాసంగి పంటలో 66.11 లక్షల టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని, కేంద్ర ప్రభుత్వం కేవలం 15 లక్షల టన్నులు మాత్రమే తీసుకోనుందని చెప్పారు. మరో 20 లక్షల టన్నులు కూడా తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## కొంత సానుకూలత.. మరికొంత ప్రతికూలత: కేటీఆర్

కేంద్ర మంత్రులతో మాట్లాడినప్పుడు కొంత సానుకూలత, మరికొంత ప్రతికూలత కనిపించిందని కేటీఆర్ విలేకరులకు తెలిపారు. తెలంగాణలో ప్రారంభించిన శానిటేషన్ హబ్ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ ప్రశంసించారని చెప్పారు. త్వరలోనే దిల్లీలో సమావేశం ఏర్పాటు చేస్తామని.. అక్కడ ప్రజెంటేషన్ ఇవ్వాలని కోరారని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, నూతన ప్రాజెక్టుల మంజూరులో తాము పక్షపాతం చూపడం లేదని పురీ వ్యాఖ్యానించారన్నారు. కాన్పూర్ తదితర నగరాలకు మెట్రో మంజూరుపై తాను ప్రశ్నించగా.. అక్కడ ట్రాఫిక్‌ను బట్టి ఇచ్చినట్లు పురీ తెలిపారన్నారు. హైదరాబాద్‌లో అంతకంటే ఎక్కువ ట్రాఫిక్ ఉందని తాను చెప్పానని కేటీఆర్ వివరించారు. పారాబాయిల్డ్ బియ్యం సేకరణపై పీయూష్ గోయల్‌కు విన్నవించగా.. చేస్తాం.. చూస్తామన్నట్లు మాట్లాడారని, వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ విషయంలోనూ గోయల్ సానుకూలత చూపలేదని కేటీఆర్ తెలిపారు.